సాక్షి పెద్దపల్లి

శుక్రవారం । 19 । ఏప్రిల్ । 2024

బీ ఫాం అందుకున్న కొప్పుల

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి లోక్‌సభ (ఎస్సీ రి జర్వుడు) స్థానం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ పడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు గురువారం పార్టీ అధినేత కేసీఆర్ బీ ఫాం అందజేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భ వన్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు మనోహర్‌రెడ్డి, చందర్, జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, ఎమ్మెల్సీ భానుప్రసాదరావు తదితరులున్నారు. కాగా ఈశ్వర్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి.



బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నుంచి బీ ఫాం అందుకుంటున్న కొప్పుల ఈశ్వర్

తొలిరోజు నలుగురు

- మొదటిరోజు నామినేషన్లు వేసిన స్వతంత్ర అభ్యర్థులు
- నేడు కేటీఆర్ సమక్షంలో భారీ ర్యాలీతో నామినేషన్ వేయనున్న కొప్పుల
- గడ్డం వంశీకి మద్దతుగా మంత్రి, ఎమ్మెల్యేలు

సాక్షి, పెద్దపల్లి: పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలతో తొలి రోజు గురువారం పెద్దపల్లి ఎంపీ స్థానానికి నలుగురు ఇండిపెండెంట్ అభ్యర్థులు నామినేషన్లు వేశారు. ధర్మపురి నియోజకవర్గానికి చెందిన దూడ మహిపాల్, నూకల నవీన్, పెద్దపల్లికి చెందిన దుర్గం రాజ్‌కుమార్, అక్కపాక తిరుపతి స్వతంత్ర అభ్యర్థులుగా ఒక్కో సెట్ నామినేషన్ వేశారు. కాగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు మంచిరోజు, ముహూర్తం చూసుకొని శుక్రవారం ఒక్కో సెట్ నామినేషన్ వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం నామినేషన్లు ఈనెల 25వరకు స్వీకరిస్తారు. అలాగే నామినేషన్ల పరిశీలన 26న, ఉపసంహరణ 28న చేసుకోవచ్చు. పోలింగ్ మే 13న, జూన్ 4 కౌంటింగ్ చేసి ఫలితాలు ప్రకటించనున్నారు.

భారీ ర్యాలీతో కొప్పుల..

తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ చేతుల మీదుగా బీ ఫాం అందుకున్న ఆపార్టీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో నామినేషన్ వేయనున్నారు. జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కేటీఆర్ ప్రసంగించనున్నారు. అనంతరం అక్కడి నుంచి సమీకృత కలెక్టరేట్ వరకు నియోజకవర్గ పరిధిలోని మాజీ ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్, బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీతో వెళ్లి నామినేషన్ దాఖలు చేయనున్నారు. అలాగే కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీ జిల్లా మంత్రి శ్రీధర్ బాబు, నియోజకవర్గ పరిధిలోని ఆరుగురు ఎమ్మెల్యేల మద్దతుతో ఒక్క సెట్ నామినేషన్ వేయనున్నారు. చివరి రోజు భారీ ర్యాలీతో మరో సెట్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. బీజేపీ అభ్యర్థి గోమాసె శ్రీనివాస్ నేడు ఒక్క సెట్ నామినేషన్ వేయనుండగా, ఈనెల 24న కేంద్రమంత్రి అశ్విన్ వైష్ణవ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీతో మరో సెట్ నామినేషన్ దాఖలు చేయనున్నారు.

మిగిలింది ఐదు రోజులే

ఎన్నికల నోటిఫికేషన్ ప్రకారం నామినేషన్లు గురువారం నుంచి స్వీకరిస్తుండగా, నేడు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఒక్క సెట్ నామినేషన్ వేయనున్నారు. మిగిలిన రోజులను చూస్తే అందులో 21వ తేదీ ఆదివారం సెలువురోజు తీసేస్తే ఐదురోజులు మాత్రమే రిటర్నింగ్ అధికారి నామినేషన్లు స్వీకరించనున్నారు. ఇందులో మంగళవారం చాలామందికి మంచిరోజు కాదన్న అభిప్రాయం ఉంటోంది. చివరి రెండు రోజులైన బుధవారం, గురువారం అభ్యర్థులు పెద్ద ఎత్తున జనసమీకరణ చేసి, భారీ ర్యాలీలతో మరో సెట్ నామినేషన్ వేసి బలప్రదర్శన నిరూపించుకునే అవకాశాలున్నాయి.



రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్‌ఖాన్‌కు నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న స్వతంత్ర అభ్యర్థి అక్కపాక తిరుపతి



దూడ మహిపాల్



డి.రాజ్‌కుమార్



నూకల నవీన్

న్యూస్‌రీల్

పకడ్బందీగా ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ అన్నారు. పరీక్షల నిర్వహణపై గురువారం కలెక్టరేట్‌లో డీఈవో మాధవితో కలిసి సమీక్షించారు. ఈనెల 25 నుంచి మే 2 వరకు జరిగే ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో టెన్త్ పరీక్షలకు రెండు, ఇంటర్ పరీక్షలకు మూడు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. డెప్యూటీ తహసీల్దార్ ఆధ్వర్యంలో ఫ్లయింగ్‌స్క్వాడ్ ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఇంటర్ నోడల్ అధికారి కల్పన, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఉపాధిలో కూలీల సంఖ్య పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీవో రవీందర్ రాథోడ్

సుల్తానాబాద్(పెద్దపల్లి): ఉపాధి హామీలో కూలీల సంఖ్యను పెంచాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లపై ఉందని డీఆర్డీవో రవీందర్ రాథోడ్ అన్నారు. గురువారం సుల్తానాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో సుల్తానాబాద్, జూలపల్లి, ఎలిగేడు, ఓదెల మండలాల ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. వేసవి అయినందున పని ప్రదేశాల్లో కూలీలకు తాగునీటితో పాటు నీడ సౌకర్యం కల్పించాలని సూచించారు. మొదటిసారిగా సుల్తానాబాద్ వచ్చిన డీఆర్డీవోకు ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు మొక్క అందజేశారు. ఏపీడీ సత్యనారాయణ, హెచ్ఆర్ మేనేజర్ రమేశ్, ఏపీవో మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో డీపీవో ఆకస్మిక పర్యటన



బోర్‌వెల్‌ను పరిశీలిస్తున్న డీపీవో ఆశలత

రామగుండం: అంతర్గాం మండలం కుందనపల్లి, అంతర్గాం గ్రామాలను గురువారం జిల్లా పంచాయతీ అధికారి ఆశలత ఆకస్మికంగా సందర్శించారు. గ్రామాల్లో తాగునీటి వనరుల లభ్యతపై సమీక్షించారు. అక్బర్‌నగర్‌లో బోర్‌వెల్ పనితీరును పరిశీలిస్తూ గ్రామంలో ఉన్న బోర్‌వెల్స్, గ్రామ జనాభా, తాగునీటి వనరుల విషయమై పంచాయతీ కార్యదర్శికృష్ణను అడిగి తెలుసుకొని పలు సూచనలు, సలహాలిచ్చారు. తాగునీటి సరఫరా విషయమై ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అంతర్గాంలోని ఎస్సీ, బీసీ కాలనీలను సందర్శించి తాగునీటి సరఫరాపై ఆరా తీశారు. డీపీవో వెంట ఎంపీవో అబ్దుల్ వాజిద్, ఎంపీడీవో ఎంఏ అలీం తదితరులు ఉన్నారు.

దుబ్బపల్లి చెక్‌పోస్ట్ తనిఖీ



చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలను పరిశీలిస్తున్న ఆర్డీవో గంగయ్య

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సుల్తానాబాద్ మండలం దుబ్బపల్లి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను గురువారం ఆర్డీవో గంగయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల నిబంధనల ప్రకారం రూ.50వేలు మించి నగదు తరలిస్తే సీజ్ చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో డబ్బు చేతులు మారే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున పోలీసులు, ఎలక్షన్ స్క్వాడ్స్ ముమ్మరంగా తనిఖీలు చేపట్టాలని సూచించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎస్సై శ్రావణ్‌కుమార్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

రామగిరి @ 44.9

- జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు
- ఉదయం 10 గంటలకే నిర్మానుష్యంగా మారుతున్న రహదారులు

ఉష్ణోగ్రతలు (డిగ్రీలలో)

18న	44.9	16న	43.1
17న	43.5	15న	41.4



గోదావరిఖని చౌరస్తా రోడ్డుపై ఆమ్లెట్ వేస్తున్న సింగరేణి రిటైర్డ్ కార్మికుడు కనకయ్య

కోల్‌సిటీ(రామగుండం): భానుడు నిప్పులు కక్కుతున్నాడు. సెగలు రేపుతూ తన విశ్వరూపాన్ని ప్రదర్శిస్తున్నాడు. ఎండకు తోడు వడగాడ్పులతో జనం ఇబ్బందులకు గురవుతున్నారు. ఇళ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. దీంతో ఉదయం 10 గంటలకే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. గురువారం జిల్లాలో 44.9 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. రామగిరి మండలం కల్వచర్లలో 44.9, ఈసాలతక్కళ్లపల్లిలో 44.2, మధ్యాహ్నం రామగుండంలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండల తీవ్రతలకు జనం అనారోగ్యాలకు గురవుతున్నారు. జీజీహెచ్ ఆస్పత్రితోపాటు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో సీజనల్ వ్యాధులతో చికిత్స కోసం వచ్చే పేషెంట్ల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. వడదెబ్బ లక్షణాలు, తలనొప్పి, జ్వరం, వాంతులు, విరోచనాలు తదితర సమస్యలతో ఆస్పత్రికి చికిత్స కోసం వస్తున్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యం

- గెలుపు కోసం చేపడుతున్న దొంగ దీక్షలను ప్రజలు గమనించాలి
- కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కంకణం కట్టుకోవాలి
- ధర్మపురి ముఖ్య కార్యకర్తల సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు



ధర్మపురిలో ప్రసంగిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

ధర్మపురి: అసెంబ్లీ ఎన్నికల్లో ధర్మపురి నియోజకవర్గం కాంగ్రెస్ వశమైందని, అదే ఊపుతో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థికి భారీ మెజార్టీ ఇవ్వాలని ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలో గురువారం నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. ఎన్నికల్లో గెలుపు కోసం దొంగ దీక్షలు చేపడుతున్న ఈశ్వర్ తీరును ప్రజలు గమనించాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో గడ్డం వంశీకృష్ణకు 50వేల మెజారిటీ వచ్చేలా కార్యకర్తలు కంకణం కట్టుకోవాలన్నారు. ఎమ్మెల్సీ, నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని తెలిపారు. వంశీకృష్ణను భారీ మెజారిటీతో గెలిపించుకునేందుకు శాయాశక్తులా కృషి చేస్తామని పెద్దపల్లి, రామగుండం, చెన్నూర్, మంచిర్యాల ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్, గడ్డం వివేక్, ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తకు ఫిట్స్..

మంత్రి శ్రీధర్‌బాబు ప్రసంగిస్తున్న సమయంలో ఓ కాంగ్రెస్ కార్యకర్తకు ఫిట్స్ రావడంతో కింద పడిపోయాడు. వెంటనే మంత్రి ప్రసంగాన్ని ఆపివేశారు. విప్ లక్ష్మణ్ అతడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు.

కార్మిక నాయకుడిగా 'కొప్పుల' ఏమి సాధించారు



గేట్‌మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

- రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్

గోదావరిఖని(రామగుండం): కార్మిక నాయకుడిగా కొప్పుల ఈశ్వర్ ఈప్రాంతానికి ఏమి సాధించారని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ ప్రశ్నించారు. గురువారం ఆర్జీ–1 ఏరియా జీడీకే–11గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్‌తో కార్మికుల కష్టాలు పెరిగాయన్నారు. ఎన్నికల కోడ్ పూర్తయిన వెంటనే కార్మికుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన వెంటనే ప్రజాపాలన పేరుతో సింగరేణికి సమర్థుడైన సీఅండ్ఎండీ బలరాంనాయక్‌ని నియమించామని వివరించారు. ఈప్రాంత యువతను దృష్టిలో ఉంచుకొని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం ఎంపీ అభ్యర్థి మాట్లాడుతూ, ఎంపీగా అవకాశం ఇవ్వాలని, సింగరేణి కార్మికుల సమస్యలు పార్లమెంట్‌లో ప్రస్తావించి న్యాయం చేసేలా కృషి చేస్తానన్నారు. ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్, నాయకులు మహంకాళి స్వామి, మారెల్లి రాజిరెడ్డి, ముస్తాఫా, పెద్దెల్లి ప్రకాశ్, తిప్పారపు శ్రీనివాస్, గట్టు రమేశ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక మేదరబస్తీలోని ఉల్లిగడ్డల బజార్‌లో నిర్మించిన విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘ భవన బ్యాంకెట్‌హాల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్‌లో చేరగా, పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

కేటీఆర్‌ను కలిసిన టీబీజీకేఎస్ నేతలు



కేటీఆర్‌తో టీబీజీకేఎస్ నాయకులు

గోదావరిఖని(రామగుండం): బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను గురువారం టీబీజీకేఎస్ నాయకులు హైదరాబాద్ పార్టీ కార్యాలయంలో కలిశారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ గెలుపుకోసం కృషి చేస్తామన్నారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, టీబీజీకేఎస్ నాయకులు మిర్యాల రాజిరెడ్డి, జాహిద్‌పాషా, నూనె కొమురయ్య, సంపత్‌రెడ్డి, నాగెల్లి సాంబయ్య, చల్ల రవీందర్‌రెడ్డి, వడ్డెపల్లి శంకర్ తదితరులున్నారు.

జ్వరాలపై జాగ్రత్తలు తీసుకోవాలి



శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

జూలపల్లి(పెద్దపల్లి): గ్రామాల్లో వైరల్ జ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ సూచించారు. మండలంలోని చీమలపేటలో డెంగీతో చికిత్స పొందుతున్న ఇద్దరిని గురువారం పరామర్శించారు. క్రమం తప్పకుండా మందులు వాడాలని సూచించి, అనంతరం గ్రామంలో పారిశుధ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని సందర్శించారు. వైరల్ జ్వరాల బారిన పడిన గ్రామస్తుల రక్త నమూనాలను సేకరించాలని సూచించారు. అంతకు ముందు ఎంపీడీవో పద్మజ, ఎంపీవో కిరణ్ వైద్య శిబిరాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి, హెచ్‌వీ వసంత, పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి, ఏఎన్ఎంలు అరుణ, రుక్మిణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్

రామగుండం: అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకొని గురువారం అంతర్గాం మండలం కుందనపల్లిలోని హనుమాన్ ఇండస్ట్రీస్‌లో అగ్ని ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ఆకస్మికంగా అగ్ని ప్రమాదాలు సంభవిస్తే చేపట్టాల్సిన తక్షణ చర్యలపై అవగాహన కల్పిస్తూ తీసుకోవాల్సిన జాగ్రతలను కార్మికులకు వివరించారు. ఇందులో భాగంగా చెత్తతో కృత్రిమంగా మంటలు సృష్టించి నివారించే పద్ధతులు, ద్రవ పదార్థాలైన కిరోసిన్, పెట్రోల్, డీజిల్, వంటనూనె అగ్ని ప్రమాదానికి గురైతే ఎలాంటి మెలకువలు పాటించాలనే విషయమై సీటూ2 సహాయంతో ప్రదర్శన రూపంలో చూపించారు. ఈ ప్రదర్శనలో హనుమాన్ ఇండస్ట్రీస్ ప్రతినిధి రామిని శశిధర్, ఫైర్ ఆఫీసర్ సత్యనారాయణ, సిబ్బంది రాజు, శ్రీకాంత్, శ్రీనివాస్, నాగేంద్ర తదితరులున్నారు.



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న సిబ్బంది

పారిశ్రామిక కారిడార్‌గా రామగుండం



మాట్లాడుతున్న జనక్ ప్రసాద్

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): రామగుండం ప్రాంతాన్ని పారిశ్రామిక కారిడార్‌గా మారుస్తామని ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రెటరీ జనక్‌ప్రసాద్ అన్నారు. గురువారం యైటింక్లయిన్‌కాలనీ ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. రానున్న నాలుగేళ్లలో సింగరేణిలో కొత్త గనులు తేవడంతో పాటు పరిశ్రమలు నెలకొల్పి 15వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఇప్పటికే సింగరేణిలో 427 డిపెండెంట్ ఉద్యోగాలు ఇప్పించామని వివరించారు. కేంద్రంతో మాట్లాడి తాటిచెర్ల బొగ్గు గనిని ప్రభుత్వమే నడిపేలా చేశామని, కాంట్రాక్ట్ కార్మికులకు మెరుగైన వేతనాలు చెల్లించేలా చూస్తామన్నారు. ఈ నెల 21న గోదావరిఖని బృందావన్‌గార్డెన్‌లో నిర్వహించే మహాసభలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అలాగే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీని గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు కొత్త సత్యనారాయణ, ఎండీ అక్రమ్, వికాస్‌కుమార్, శంకర్‌నాయక్, సదానందం, కృష్ణ, పోచయ్య, ప్రభాకర్‌రెడ్డి, రవి, రమేశ్, నవీన్‌కుమార్, పి.రమేశ్, భాస్కర్, దశరథంగౌడ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రహిత ప్రాంతంగా మారుస్తాం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏసీపీ రమేశ్, సీఐ, ఎస్సైలు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): గోదావరిఖని ప్రాంతాన్ని గంజాయి రహితంగా మార్చుటకు కృషి చేస్తామని ఏసీపీ రమేశ్ పేర్కొన్నారు. గురువారం టూటౌన్ స్టేషన్ ఆవరణలో గంజాయి విక్రయదారుల అరెస్ట్ వివరాలు వెల్లడించారు. యైటింక్లయిన్‌కాలనీ, కమాన్‌పూర్ పరిసర ప్రాంతాల్లో ఈ నెల 1 నుంచి ఇప్పటివరకు 17 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని, అలాగే 3 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. గోదావరిఖని పరిధిలో రెండు బృందాలు ఏర్పాటు చేసి గాలింపు చేపట్టగా, వివిధ ప్రాంతాల నుంచి గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తున్నాడనే సమాచారంతో కాలనీలో శివ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి, అతడి ద్వారా గంజాయి పండించే వ్యక్తిని సైతం అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. మొత్తం 9 మంది విక్రయదారులు, నలుగురు కంజుమర్లు, ఇద్దరు డీలర్స్, ఒకరు కొరియర్, ఒకరు గంజాయి పండించే ఆదిలాబాద్ జిల్లా లోకారి గ్రామానికి చెందిన కోవా నాగోరావు ఉన్నట్లు తెలిపారు. అనంతరం టీఎస్ఎన్ఏబీ పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా గంజాయి విక్రయిస్తున్న వారిని పట్టుకోవడంలో సహకరించిన ఎస్సైలు, పోలీసులకు రివార్డులు అందజేశారు. టూటౌన్ సీఐ రవీందర్, ఎస్సైలు సనత్‌కుమార్, వెంకటేశ్, కమాన్‌పూర్ ఎస్సై చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలతో భూగర్భజలాల పెంపు

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: ఇంకుడు గుంతలను నిర్మించి భూగర్భజలాలను పెంపొందిద్దామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. కలెక్టరేట్ ఆవరణలో గురువారం అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి ఇంకుడుగుంత నిర్మాణ పనులు ప్రారంభించారు. వర్షాకాలంలో వాననీరు వృథాగా పోకుండా ఇంకుడుగుంతలు నిర్మించి భూగర్భజలాలను వృద్ధి చేసుకోవాల్సిన అవసరముందన్నారు. కలెక్టరేట్ ఆవరణలో వర్షపు నీరు భూమిలో ఇంకేలా 19 ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు నిర్మించాలని నిర్ణయించామని పేర్కొన్నారు. వర్షాలు కురిసే సమయానికల్లా వీటి నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భూగర్భజలాలు వృద్ధి చేసేందుకు ఇంటికో ఇంకుడుగుంత నిర్మించుకోవాలని సూచించారు. డీఆర్‌డీవో రవీందర్, డీపీవో ఆశాలత, ఏవో శ్రీనివాస్ తదితరులున్నారు.

రిటర్నింగ్ అధికారితో వ్యయ పరిశీలకుడి భేటీ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ఎంపీ స్థానానికి జరిగే ఎన్నికల ప్రచార ఖర్చును పరిశీలించేందుకు ఎన్నికల వ్యయ పరిశీలకుడిగా నియమితుడైన సమీర్ నైరంతర్యా గురువారం కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ అరుణశ్రీతో సమావేశమయ్యారు. ఎన్నికల ఖర్చు వివరాల నమోదు, నిబంధనల అమలుకు చేసిన ఏర్పాట్లు, సీ విజిల్ యాప్ ఫిర్యాదుల కంట్రోల్‌రూం పరిశీలించి నోడల్ అధి కారి రవీందర్ రెడ్డి నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట అ.దికారులు శ్రీమాల, శ్రీనివాస్, తిరుపతిరావు, నరహరి తదితరులున్నారు.



కలెక్టరేట్ ఆవరణలో ఇంకుడుగుంత నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ అరుణశ్రీ, అధికారులు

క్లుప్తంగా

సివిల్స్ ర్యాంకర్‌కు సన్మానం



రామడుగు(చొప్పదండి): సివిల్స్ 27వ ర్యాంకర్, రామడుగు మండలంలోని వెలిచాలకు చెందిన నందాల సాయికిరణ్ గురువారం స్థానిక శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో స్వామివారి నిత్య కల్యాణోత్సవానికి హాజరై, పూజలు చేశారు. మాజీ సర్పంచ్ వీర్ల సరోజన ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. అలాగే, సాయికిరణ్ ఐదోతరగతి వరకు చదివిన వెలిచాల సరస్వతి పాఠశాలలో స్కూల్ కరస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్, కో–కరస్పాండెంట్ ఉప్పుల సత్యం, తేజ స్కూల్ కరస్పాండెంట్ దేవేందర్‌రావు, సామాజిక కర్త కల్లేపల్లి పర్శారాం, మాజీ సర్పంచ్ వీర్ల రవీందర్‌రావు, నాయకులు సత్కరించారు.

సీపీఆర్‌పై విద్యుత్ సిబ్బందికి అవగాహన



కొత్తపల్లి(కరీంనగర్): టీఎస్‌ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయ సమావేశ మందిరంలో విద్యుత్ సిబ్బందికి గుండెపోటు నుంచి ప్రాథమికంగా ప్రాణాలు రక్షించుకునే సీపీఆర్ విధానంపై డాక్టర్ ప్రణవ్ గురువారం అవగాహన కల్పించారు. ఎస్‌ఈ గంగాధర్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, విద్యుత్ కోతలు లేకుండా చూడాలన్నారు. గుండె నొప్పి వస్తే వైద్యులు సూచించినట్లు ప్రథమ చికిత్స చేయాలని సూచించారు. డీఈలు విజయేందర్ రెడ్డి, రాజం, తిరుపతి, ఏడీఈలు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, కిరణ్‌కుమార్, మల్లేశం, పురుషోత్తం, పీవో చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నగదు పట్టివేత



జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని టవర్ సర్కిల్ ప్రాంతంలో గురువారం ఉదయం జగిత్యాల పట్టణ ఎస్సై మన్మదరావు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. అరుణ్ అనే వ్యక్తి వద్ద నుంచి రూ.7.20 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

తహసీల్ చౌరస్తాలో..


జగిత్యాల జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో పట్టణ ఎస్సై నరేశ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. మల్యాల మండలంలోని గొర్రెగుండంకు చెందిన బైరవేని రాజు వద్ద రూ.99,500, పురాణిపేటకు చెందిన ఆవారి సందీప్ వద్ద రూ.1.16 లక్షలు పట్టుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

యువకుడిని కాపాడిన లేక్ పోలీసులు

కరీంనగర్ క్రైం: మానేరు డ్యాంలో దూకేందుకు వెళ్తున్న ఓ యువకుడిని కరీంనగర్ లేక్ పోలీసులు కాపాడారు. వారి వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలానికి చెందిన ఎం.శ్రీనివాస్ కుటుంబ సమస్యలతో మనస్తాపానికి గురయ్యాడు. గురువారం ఆత్మహత్య చేసుకునేందుకు కరీంనగర్ వచ్చాడు. మానేరు డ్యాంలో దిగుతుండగా లేక్ పోలీసులు గుర్తించి, బయటకు తీసుకువచ్చారు. అతని కుటుంబసభ్యులను పిలిపించి, కౌన్సెలింగ్ చేసి, పంపించారు.

కీలక అవయవం.. కాలేయం

- జీవ, జీర్ణక్రియల్లో తోడ్పాటు
- జీవితాంతం పెరిగే ఒకే ఒక్క అవయవం
- కాపాడుకుంటే ఆయుష్షు పెరిగినట్టే..
- నేడు ప్రపంచ కాలేయ దినోత్సవం



కరీంనగర్‌టౌన్: శరీరంలో జరిగే జీవ, జీర్ణక్రియల్లో కాలేయం ముఖ్య పాత్ర పోషిస్తుంది. నిరంతరం ఒక కెమికల్ ఫ్యాక్టరీ లాగా శరీరంలో పని చేస్తుంది. విషపదార్థాలను బయటకు పంపడంలో ఇది కీలకం. శరీరంలోని అతి పెద్ద గ్రంథి కాలేయం. మెదడు తర్వాత అతి ముఖ్యమైన అవయవం. రక్తంలో ఉండే బ్యాక్టీరియా, హానికర హార్మోన్లను తొలగిస్తుంది. అలాగే, జీవితాంతం పెరిగే ఒకే ఒక్క అవయవం కూడా ఇదే. రోగనిరోధక శక్తికి దోహదం చేస్తుంది. దీన్ని కాపాడుకుంటే ఆయుష్షు పెరుగుతుంది. కాలేయం ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి, సంబంధిత వ్యాధుల గురించి అవగాహన కల్పించడానికి ఏటా ఏప్రిల్ 19ని ప్రపంచ కాలేయ దినోత్సవంగా జరుపుకుంటున్నాం. నేడు ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా కథనం.

రక్తాన్ని వడిపోయడం..

మన శరీరంలోని జీర్ణకోశ నాళం నుంచి వచ్చే రక్తాన్ని వడపోయడం, ఆహారం ద్వారా వచ్చే రసాయనాలు, వాటిలోని విషపదార్థాలను నిర్మూలించడం, ఇన్ఫెక్షన్లు, కొవ్వులు, రక్తంలోని చక్కెర స్థాయిలను లివర్ నియంత్రిస్తుంది. ఏది తిన్నా, తాగినా కాలేయం ద్వారానే వెళ్తాయి. కొన్ని ఆహారాలు లివర్ ఆరోగ్యానికి మేలు చేస్తే.. మరికొన్ని దెబ్బ తీస్తాయి. అందుకే తీసుకునే ఆహారంలో జాగ్రత్తలు తీసుకోవాలి.

హాని కలిగించే ఆహారాలు..

వైట్ రైస్, తెల్ల రొట్టె, చక్కెర, ఉప్పు వంటివి కాలేయం ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. ఉప్పు, మైదాతో (రిఫైన్డ్ ఫ్లోర్) తయారు చేసిన పాస్తా, పిజ్జా, బిస్కెట్లు, వైట్ బ్రెడ్ లాంటి ఆహార పదార్థాలు, మీగడ పాలు, ఐస్‌క్రీమ్, చీజ్ వంటి అధిక కొవ్వుతో ఉన్న పాల ఉత్పత్తులకు దూరంగా ఉంటే మంచిది.

కూరగాయలు, పండ్లు తీసుకోవాలి



గతంతో పోలిస్తే కాలేయ సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయి. లివర్ దెబ్బతింటే హైపటైటిస్ ఇన్‌ఫెక్షన్లతోపాటు పుట్టుకతో సంక్రమిస్తున్న, జన్యుపరమైన వ్యాధులు, ఫ్యాటీ లివర్ ప్రాణాంతకంగా మారుతున్నాయి. కాలేయాన్ని కాపాడుకోవాలంటే కూరగాయలు, పండ్లు, ఫైబర్ శాతం ఎక్కువగా ఉండే పదార్థాలు తీసుకోవాలి. మద్యం మానేయడం, మసాలాలు, చల్లటి వస్తువులు, వేపుళ్లు తినకుండా ఉండటం, పులుపు పదార్థాలు తగ్గించి, బరువును నియంత్రణలో ఉంచుకోవడం వంటివి చేయాలి.

– డాక్టర్ దిలీప్‌రెడ్డి, సర్జికల్ గ్యాస్ట్రో, మెడికవర్ ఆసుపత్రి

విటమిన్–సి చాలా అవసరం

ఆకు కూరలు, వెల్లుల్లి, బంగాళదుంప, బీట్ రూట్, క్యారెట్ లాంటి దుంపకూరలు కాలేయంలోని కణాల పునరుత్పత్తికి బాగా సహాయపడతాయి. లివర్‌ను రక్షించుకునేందుకు విటమిన్–సి అధికంగా లభించే ద్రాక్ష, ఆపిల్, నిమ్మరసం చాలా అవసరం. వీటితోపాటు వ్యాయామం చేయాలి.

అవినీతి సొమ్ము పార్టీలకిస్తే నీతిమంతమవుతుందా?

- ఎలక్ట్రోబాండ్ల పేరుతో అవినీతికి మోడీ ప్రోత్సాహం
- రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ కార్పొరేషన్: అవినీతి డబ్బులను పార్టీలకు విరాళాలుగా ఇస్తే ఆ సొమ్ము నీతిమంతమవుతుందా అని బీసీ సంక్షేమ,రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బీజేపీ నాయకులను ప్రశ్నించారు. ఎలక్ట్రో బాండ్లను బీజేపీ సమర్థించుకోవడం సరికాదని, భవిష్యత్‌లో ఇది ఇబ్బందికరంగా మారుతుందని హెచ్చరించారు. గురువారం కరీంనగర్‌లోని ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల మైదానంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎలక్ట్రో బాండ్ల ద్వారా బీజేపీ క్విడ్‌ప్రోకు పాల్పడుతోందని ఆరోపించారు. ఎలక్ట్రోబాండ్ల ద్వారా అవినీతి సొమ్మును తీసుకుంటున్న ప్రధాని నరేంద్రమోడీ పరోక్షంగా అవినీతిని ప్రోత్సహించినట్లే అన్నారు. లిక్కర్‌స్కాంలో నిందితుడు శరత్ చంద్రకు బెయిల్ రావడానికి, రూ.500 కోట్ల బాండ్లు బీజేపీకి ఇచ్చారని తెలిపారు. ఇదే క్విడ్ ప్రోకు ఉదాహరణ అని తెలిపారు. సీఎం బీజేపీలో కలుస్తారని, ఆర్ ట్యాక్స్ అంటూ పనికిరాని మాటలు మాట్లాడుతున్నారని, తమ ప్రభుత్వం మాత్రం పనిచేసుకుంటూ ముందుకు పోతున్నామన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం ఇబ్బందుల్లో ఉందని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు ప్రజలు కాంగ్రెస్‌తో కలిసి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

మంత్రికి న్యాయవాదుల ఆత్మీయ సన్మానం

కరీంనగర్‌క్రైం: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, న్యాయవాది పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను గురువారం కరీంనగర్ జిల్లా బార్ అసోసియేషన్ కార్యవర్గం, న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇళ్ల స్థలాల కోసం 20 ఎకరాలు, న్యాయవాదుల కాన్ఫరెన్స్ హాల్ నిర్మాణానికి 5 ఎకరాలు, హెల్త్‌కార్డుల పరిమితి రూ.2లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని, కొత్తగా వచ్చిన న్యాయవాదులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని, జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.5 వేలు చొప్పున ఐదేళ్ల పాటు ఇవ్వాలని కోరగా పరిశీలిస్తానని మంత్రి తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రఘువీర్, కార్యదర్శి బీమాసాహెబ్, కోశాధికారి రామగిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లారీలో ఉన్నవి పీడీఎస్ బియ్యమే

- ల్యాబ్ పరీక్షలో నిర్ధారణ
- 350 క్వింటాళ్ల బియ్యం సీజ్, ముగ్గురిపై 6ఏ కేసు

హుజూరాబాద్: పట్టణంలోని పరకాల క్రాస్ రోడ్ వద్ద ఈ నెల 10వ తేదీన పోలీసులు పట్టుకున్న బియ్యం పీడీఎస్ రైస్‌గా నిర్ధారణ అయ్యాయని సివిల్ సప్లయ్ డీటీ వసంతరావు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. పరకాలలోని ఓ మిల్లు నుంచి పీడీఎస్ బియ్యాన్ని జైశ్రీరామ్ పేరుతో ఉన్న సంచుల్లో నింపి, హుజూరాబాద్ మీదుగా గుజరాత్‌కు లారీలో తరలిస్తుండగా పోలీసులు అనుమానించి పట్టుకున్నారని పేర్కొన్నారు. 11న తమకు అప్పగించగా బియ్యం శాంపిల్స్‌ను హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించామన్నారు. రిపోర్టులో 6 నెలల కిందటి పీడీఎస్ రైస్‌గా తేలాయన్నారు. దీంతో గురువారం రైస్‌మిలు యజమాని, లారీ డ్రైవర్, క్లీనర్‌లపై లే కేసు నమోదు చేశామని తెలిపారు. లారీలోని 350 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేసి, హుజూరాబాద్ పట్టణంలోని సివిల్ సప్లయ్ గోదాంకు తరలించి, భద్రపరిచినట్లు పేర్కొన్నారు. అయితే, బియ్యాన్ని గుజరాత్ తరలించేందుకు ప్రయత్నించారన్న అంశం స్థానికంగా చర్చనీయాంశమైంది.



బియ్యాన్ని సివిల్ సప్లయ్ గోదాంలో దించుతున్న హమాలీలు

గంజాయి మాయం కేసులో ఇద్దరు ఎస్సైల సస్పెన్షన్

- హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్ కూడా..

జగిత్యాలక్రైం/సారంగాపూర్: జగిత్యాల జిల్లా సారంగాపూర్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు పట్టుకున్న 70 కిలోల గంజాయి మాయమైన కేసులో బాధ్యులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. విధుల్లో అలసత్వం వహించిన వారిపై ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ మల్టీజోన్–1 ఐజీ ఏవీ రంగనాథ్‌కు నివేదిక అందజేశారు. దీంతో సారంగాపూర్ పోలీస్‌స్టేషన్‌లో గతంలో పని చేసిన ఎస్సై మనోహర్‌రావు, ప్రస్తుత ఎస్సై తిరుపతి, హెడ్‌కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి, కానిస్టేబుల్ నరేందర్‌లను సస్పెండ్ చేస్తూ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన ‘కోడి పంచాయితీ’

- రూ.30వేల విలువైన భీమవరం జాతి కోడి చోరీ

జగిత్యాలక్రైం: తాము పెంచుకున్న భీమవరం జాతి కోడిని దొంగిలించారని సదరు కోడి యజమాని, జగిత్యాల జిల్లాకేంద్రంలోని శ్రీనగర్‌కాలనీకి చెందిన కర్కు శివనాగరాజు గురువారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాని విలువ సుమారు రూ.30 వేలు ఉంటుందని పేర్కొన్నారు. విచారణ చేపట్టిన పోలీసులు నాగేంద్రనగర్‌కాలనీకి చెందిన నాగరాజు వద్ద కోడి ఉన్నట్లు గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. నాగరాజు పోచమ్మవాడకు చెందిన ఎల్లేశ్ అనే వ్యక్తి నుంచి రూ.3 వేలకు కొనుగోలు చేసినట్లు పోలీసుల ముందు ఒప్పుకున్నాడు. నాగరాజు కోడిని తెచ్చి శివనాగరాజుకు అప్పగించాలని పోలీసులు సూచించగా.. నాగరాజు కుటుంబసభ్యులు నిరాకరించారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

రౌడీ షీటర్ల బైండోవర్

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రేకుర్తి గ్రామానికి చెందిన ఐదుగురు రౌడీషీటర్లను గురువారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై సాంబమూర్తి తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు.

సాయ్ హ్యాండ్‌బాల్ అకాడమీకి ఎంపిక



సంజీవ్



ఈశ్వర్



చంటి



దేవేందర్



వంశీ

కరీంనగర్ స్పోర్ట్స్: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్)కు చెందిన కర్నూల్‌లోని హ్యాండ్‌బాల్ అకాడమీకి ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి ఐదుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్ గురువారం తెలిపారు. సంజీవ్, ఈశ్వర్(రామడుగు), చంటి, దేవేందర్(కాటారం), వంశీ(గుల్లకోట) ఎంపికయ్యారన్నారు. క్రీడాకారులను సంఘం సంయుక్త కార్యదర్శి ప్రభాకర్, కోచ్ వెంకటేశ్ అభినందించారు.

‘కార్పొరేట్ కళాశాలల స్కీంకు దరఖాస్తు చేసుకోండి’

కరీంనగర్: 2024–25 విద్యా సంవత్సరానికి గానూ రెప్యుటెడ్(కార్పొరేట్) జూనియర్ కళాశాలల స్కీంకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి నేతాని యల్ ఒక ప్రకటనలో తెలిపారు. రెప్యుటెడ్ స్కీం కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ, అంధ విద్యార్థులకు ప్రైవేట్ కళాశాలల్లో అడ్మిషన్లు కల్పించనున్నామన్నారు. కొత్తగా జిల్లాలోని ప్రైవేట్ జూనియర్ కాలేజీలను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. రెసిడెన్షియల్ వసతి కలిగి, విద్యాబోధన సాగించే అర్హత గల కళాశాలలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. యాజమాన్యాలు ఐదేళ్లకు సంబంధించిన అకాడమిక్ ప్రొఫైల్‌తోపాటు ఈ–పాస్ వెబ్‌సైట్‌లో లాగిన్ అయి, రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ నెల 27లోగా అన్ని వివరాలతో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు. ఎంపికైన కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఏటా ట్యూషన్ ఫీజు కింద ఒక్కొక్కరికి రూ.35 వేలు, పాకెట్ మనీ కింద రూ.3 వేలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

వ్యాన్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- బస్సు డ్రైవర్, కండక్టర్, ప్రయాణికులకు గాయాలు



గంగాధర(చొప్పదండి): వ్యాన్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో పలువురు గాయపడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. గురువారం తెల్లవారుజామున గంగాధర మండలంలోని కురిక్యాల శివారు వరద కాలువ సమీపంలో ఓ వ్యాన్‌ను ఇండికేటర్లు వేయకుండా నిలిపి ఉంచారు. అదే సమయంలో వెనక వైపు నుంచి వచ్చిన కోరుట్ల డిపోకు చెందిన బస్సు ఆ వ్యాన్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్, కండక్టర్‌తోపాటు పలువురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, బాధితులను ఆస్పత్రికి తరలించారు. కోరుట్ల డిపోకు చెందిన ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్‌రెడ్డి తెలిపారు.

‘మృతదేహం ప్రకాశం జిల్లా వాసిది’

మానకొండూర్: మండలంలోని ఈదులగట్టెపల్లి ఎస్సారెస్పీ కాకతీయ కాలువ సమీపంలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన విషయం విదితమే. అయితే, అది ప్రకాశం జిల్లా దొనకొండ మండలం భూమనపల్లికి చెందిన మురికిపూడి చిన్న చెన్నయ్య(36)దిగా గుర్తించామని మానకొండూర్ సీఐ రాజ్‌కుమార్ గురువారం తెలిపారు. అతను కరీంనగర్‌లో ఉంటున్న ప్రకాశం జిల్లాకే చెందిన తన్నీరు శ్రీనివాస్ వద్దకు 10 రోజుల క్రితం మేస్త్రీ పని కోసం వచ్చాడన్నారు. కానీ, తాగుడుకు బానిసై, పనికి వెళ్లకుండా తిరుగుతున్నాడని తెలిపారు. ఇదే విషయాన్ని శ్రీనివాస్ చిన్న చెన్నయ్య తల్లిదండ్రులకు చెప్పాడన్నారు. ఎండదెబ్బ తగిలి చనిపోయి ఉంటాడని మృతుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వ్యవసాయ బావిలో పడి బాలిక మృతి

- మృతురాలి స్వస్థలం నెల్లూరు జిల్లా కందుకూరు

వీణవంక(హుజూరాబాద్): వ్యవసాయ బావిలో పడి, ఓ బాలిక మృతిచెందింది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా కందుకూరుకు చెందిన దేవరకొండ శ్రీనివాస్ భార్య, కూతురితో కలిసి వీణవంక మండలంలోని గంగారం గ్రామానికి వచ్చాడు. వీరు స్థానికంగా బాతులను మేపుతున్నారు. ఈ క్రమంలో గురువారం శ్రీనివాస్ కూతురు పార్వతి(13) ఎండవేడికి తట్టుకోలేక మంచినీళ్ల కోసం వ్యవసాయ బావి వద్దకు వెళ్లింది. నీరు తాగేందుకు ప్రయత్నిస్తుండగా ప్రమాదవశాత్తు బావిలో పడి, మునిగిపోయింది. గ్రామస్తులు, కుటుంబసభ్యులు గమనించి, పోలీసులకు సమాచారం అందించడంతో వచ్చి, మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బలవన్మరణం

కరీంనగర్‌రూరల్: ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నట్లు కరీంనగర్‌రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రూరల్ మండలంలోని ఆరెపల్లికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు గంట్ల గోపాల్‌రెడ్డికి ఇద్దరు కుమారులున్నారు. చిన్న కుమారుడు మనీశ్‌రెడ్డి(31) హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్నాడు. బుధవారం తల్లిదండ్రులు కంటి వైద్యం కోసం వరంగల్ వెళ్లారు. మధ్యాహ్నం 2 గంటలకు సమీపంలోని పెద్దనాన్న ఇంట్లో భోజనం చేసి, ఇంటికి వచ్చిన మనీశ్‌రెడ్డి ఉరేసుకున్నాడు. గురువారం ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు తలుపులు కొట్టగా తీయలేదు. పగులగొట్టి చూడగా లోపల ఉరేసుకొని కనిపించాడు. మానసిక స్థితి సరిగా లేక, జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు మనీశ్‌రెడ్డి రాసిన సూసైడ్ నోట్ దొరికింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకొని, పరిశీలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

హార్వెస్టర్‌లో పడి, తెగిన రైతు చేయి

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండలంలోని ఇదులాపూర్ గ్రామంలో వంగళ సదాశివ రెడ్డి అనే రైతు చేయి తెగిపడింది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. సదాశివరెడ్డి గురువారం హార్వెస్టర్‌తో తన వరి పొలం కోయిస్తున్నాడు. ఆ సమయంలో ఆయన కుడి చేయి, ప్రమాదవశాత్తు హార్వెస్టర్‌లో పడి, తెగిపోయింది. తీవ్ర రక్తస్రావమై, బాధితుడు స్పృహ కోల్పోయాడు. చుట్టుపక్కల ఉన్న రైతులు నీళ్లు చల్లడంతో తేరుకున్నాడు. కుటుంబసభ్యులు అతన్ని కరీంనగర్ ఓ ఆస్పత్రికి తరలించారు.



30 కిలోల బొచ్చె చేప

బోయినపల్లి(చొప్పదండి): రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం కొదురుపాక సమీపంలోని మిడ్‌మానేరు ప్రాజెక్టులో గురువారం ఓ మత్స్యకారుడికి 30 కిలోల బొచ్చె చేప పడింది. కొదురుపాక పాత గ్రామ పరిసరాల్లోకి మత్స్యకారులు చేపల వేటకు వెళ్లగా అనిల్ వలకు భారీ చేప చిక్కింది. దాన్ని ముగ్గురు మత్స్యకారులు కలిసి బయటకు తీసుకొచ్చారు.

సూక్ష్మ సేద్యం.. ఎప్పుడు మోక్షం?

- పథకం కింద ఆరేళ్లుగా రాని బిందు, తుంపర పరికరాలు
- కేవలం పండ్ల తోటలకు అందజేత
- ప్రైవేట్‌లో అధిక ధరలతో దోపిడీ
- ఉమ్మడి జిల్లా రైతుల నిరీక్షణ

కరీంనగర్ అర్బన్: సూక్ష్మ సేద్యం అందని ద్రాక్షగా మారింది. నీటి పొదుపుతోపాటు పర్యావరణానికి ఇతోధికంగా దోహదపడే ఈ సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఆరేళ్లుగా సూక్ష్మ సాగునీటి పథకం కింద బిందు, తుంపర పరికరాలకు ప్రభుత్వం నిధులు కేటాయించడం లేదు. చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం రాయితీ ఉండగా ఐదెకరాలకు పైగా ఉన్న వారికి 80 శాతం రాయితీపై పరికరాలను పంపిణీ చేసేవారు. ప్రస్తుతం పండ్ల తోటలు సాగు చేసుకునే రైతులకు మాత్రమే అందిస్తుండగా ఇతరులకు రిక్తహస్తమే ఎదురవుతోంది.

2003లో పథకం ప్రారంభం

2003 నుంచి సూక్ష్మ సాగునీటి పథకం అమలు చేస్తున్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో ఉమ్మడి జిల్లాలో 30 వేల ఎకరాల్లో బిందు, తుంపర సేద్యం చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన దరిమిలా బిందు సేద్యానికి అధిక ప్రాధాన్యమివ్వాలని నిర్ణయించింది. రైతులు కూడా కరువు కాటకాల నుంచి పంటలను కాపాడుకునేందుకు బిందు సేద్యంపై మొగ్గు చూపుతున్నారు. ఉద్యాన శాఖ కార్యాలయానికి వేలాదిగా దరఖాస్తులు రావడంతో పరికరాల కేటాయింపునకు అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఐదేళ్ల క్రితం అర్జీ పెట్టుకున్న రైతుకు కూడా అందించే పరిస్థితి లేదు. ఇప్పుడున్న దరఖాస్తులను పరిశీలిస్తే పరికరాలను అందుకోడానికి మరో ఐదేళ్ల వరకు ఎదురుచూడాల్సిన పరిస్థితి.



బిందు పరికరాన్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

నిధుల కేటాయింపు అరకొర

సూక్ష్మసేద్యం ద్వారా పంటలు సాగు చేసేందుకు ఉమ్మడి జిల్లా రైతులు సిద్ధంగా ఉన్నారు. ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో అన్నదాతలకు బిందు, తుంపర పరికరాలు అందడం లేదు. 2014–15 సంవత్సరంలో 1,500 హెక్టార్లలో బిందు పరికరాలు అందించేందుకు రూ.12 కోట్లు, 432 హెక్టార్లలో తుంపర పరికరాలకు రూ.1.20 కోట్లు మంజూరు చేసింది. 2015–16 సంవత్సరంలో 1,152 హెక్టార్లలో బిందు పరికరాలకు రూ.8.36 కోట్లు, 616 హెక్టార్లలో తుంపర పరికరాలకు రూ.88 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులు ఎటూ సరిపోలేదు. అప్పటికే వేలాది మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ విస్తృత ప్రచారంతో 2016–17 సంవత్సరానికి గానూ 2,500 మంది అర్జీ పెట్టుకున్నారు. దరఖాస్తుల లెక్క ప్రకారం 21 వేల హెక్టార్లలో బిందు సేద్యం సాగవ్వాల్సి ఉంది. ఈ పరికరాలకు సుమారు రూ.60 కోట్లు అవసరమవుతాయని అధికారుల అంచనా. 2,231 హెక్టార్లలో తుంపర పరికరాల కోసం రైతులు దరఖాస్తు చేసుకున్నారు. వీటికి మరో రూ.5 కోట్లు అవసరమవుతాయి. ప్రభుత్వం కేవలం రూ.26 కోట్లు మంజూరు చేసింది. 2018 నుంచి కేటాయించక పోవడంతో రైతులకు నిరీక్షణ తప్పడం లేదు.

బిందు, తుంపర సేద్యంతో ఆదా ఇలా

అంశం	ఎంత శాతం
నీరు	43.8
విద్యుత్	33
పంట ఉత్పాదకత	52.30

జోరందుకున్న ప్రైవేటు వ్యాపారం

ప్రభుత్వ రాయితీ పడకేయడంతో ప్రైవేటు వ్యాపారం జోరందుకుంది. అధిక ధరలకుతోడు నాణ్యత లేమి, సేవలో లోపంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. మార్కెట్లో ప్రైవేటుగా బిందు, తుంపర పరికరాలను కొనుగోలు చేస్తుండటంతో ఎకరానికి సుమారు రూ.30 వేలు అదనంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి. ఉమ్మడి జిల్లాలో 17 కంపెనీలు బిందు సేద్య, నాలుగు కంపెనీలు తుంపర సేద్య పరికరాలను సరఫరా చేస్తున్నాయి. అయితే, కొన్ని కంపెనీలు సకాలంలో స్పందిస్తుండగా మిగతావి కావాలనే రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. పరికరాల బిగింపులో లేని నిబంధలను సాకుగా చూపి, వారిని భయభ్రాంతులకు గురిచేస్తూ అందినకాడికి దండుకునేవారూ లేకపోలేదు. వాటి నాణ్యత కూడా అంతంతమాత్రమే కాగా, సేవలు ఐదేళ్ల వరకు ఉచితంగా అందించాల్సి ఉండగా ఆ ఊసే లేదు. అయినా విధి లేని పరిస్థితుల్లో రైతులు ప్రైవేట్‌ను ఆశ్రయిస్తున్నారు. అయితే, పండ్ల తోటలకు మాత్రమే రాయితీ బిందు, తుంపర పరికరాలు అందిస్తున్నామని, మిగతా పంటలకు ఇవ్వడం లేదని ఉద్యానవనశాఖ అధికారులు చెబుతున్నారు.